# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 242
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
జూన్ 26, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## గడ్డం కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డు

- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు ప్రధానం




వివరాలు2లో..

# వార్ రూమ్ C/o. పర్వతగిరి

## ఓరుగల్లుకు ఫోన్ ట్యాపింగ్ సెగలు



- 'ఎర్రబెల్లి' అనుచరుడి వాంగ్మూలం రికార్డ్
- సిట్ ఎదుట హాజరైన సుధీర్ రెడ్డి
- గతంలో దయాకర్ రావు వెన్నంటి ఉన్న 'బిల్లా'
- కొండా, జంగాలతోపాటు వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లూ ట్యాపింగ్
- పలువురు మహిళా నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్టు ప్రచారం

రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రకంపనలు రేపుతుండగా ఆ సెగలు ఓరుగల్లును కూడా తాకుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తతంగం బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. యథా రాజా.. తథా ప్రజా అన్నట్లుగా పెద్దాయన అడుగు జాడల్లోనే వరంగల్ కు చెందిన ఓ మాజీ మంత్రి పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేసుకొని ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కు కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు ఇద్దరూ వరంగల్ జిల్లాకు చెందిన వారే కావడంతో వారు జిల్లా మంత్రికి తమవంతు సహాయ సహకారాలు అందించినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు అత్యంత సన్నిహితుడు, గతంలో వెన్నంటి ఉండి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన జనగామ జిల్లాకు చెందిన బిల్లా సుధీర్ రెడ్డి వాంగ్మూలాన్ని మూడు రోజుల క్రితం సిట్ అధికారులు సేకరించినపుడు విస్తుపోయే నిజాలు తెలిపినట్లు ప్రచారం సాగుతోంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి బాగోతాన్ని వారికి వివరించినట్లు చర్చ జరుగుతోంది. ప్రత్యర్థులుగా ఉన్న కొండా మురళి, జంగా రాఘవరెడ్డితోపాటు పలువురు వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లను కూడా సదరు మంత్రి ట్యాపింగ్ చేయించి బెదిరింపులకు పాల్పడినట్లు సుధీర్ రెడ్డి సిట్ అధికారులకు తెలిపినట్లు సమాచారం. దీంతో గులాబీ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

## అత్యంత వైభవంగా.. శాకంభరీ నవరాత్రోత్సవాలు ప్రారంభం

- జ్యోతి ప్రజ్వలన చేసిన చైర్మన్ శివసుబ్రహ్మణ్యం
- హాజరైన ధర్మకర్తలు, భక్తులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 4.30 గంటలకు నిత్యాహ్నికం పూర్తయిన పిమ్మట అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్థన జరిపి అమ్మవారి నుంచి అనుమతి వచ్చిన మేరకు ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు.

(మగతా 2 లో..)




2లో..

ఫ్లాష్.. ఫ్లాష్..

## మున్సిపల్ కమిషనర్ పై దౌర్జన్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కడారి సుష్మ
- మాజీ కౌన్సిలర్ పై కేసు




2లో..

## 'మత్తు'కు దూరంగా ఉండాలి

- మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం
- నగర మేయర్ గుండు సుధారాణి
- అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ

# వార్ రూమ్ C/o. పర్వతగిరి



- ఓరుగల్లుకు ఫోన్ ట్యాపింగ్ సెగలు
- 'ఎర్రబెల్లి' అనుచరుడి వాంగ్మూలం రికార్డ్
- సిట్ ఎదుట హాజరైన సుధీర్ రెడ్డి
- గతంలో దయాకర్ రావు వెన్నంటి ఉన్న 'బిల్లా'
- కొండా, జంగాలతోపాటు వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లూ ట్యాపింగ్
- పలువురు మహిళా నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్టు ప్రచారం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 2023 నవంబర్ 15 నుంచి 30 వరకు 4,013 ఫోన్ నెంబర్లను ప్రణీత్ రావు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇందులో రాజకీయ నేతలు, ఐఏఎస్, ఐపీఎస్, జర్నలిస్టుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్లు సమాచారం. రాజకీయ ప్రయోజనాలతోపాటు ఆర్థిక ప్రయోజనాలకోసం ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేసేందుకు నిబంధనలను తుంగలో తొక్కి విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు సిట్ గుర్తించింది. అయితే ఈ కేసులో 618 మంది స్టేట్ మెంట్ ను సిట్ అధికారులు రికార్డు చేయనున్నారు. అందులో భాగంగానే ఇప్పటికే పలువురు నేతలు సిట్ ముందు హాజరై తమ వాంగ్మూలాలను వినిపిస్తున్నారు.

### ఓరుగల్లుకు సెగలు..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు పాకుతుండడంతో బీఆర్ఎస్ నేతల్లో టెన్షన్ మొదలైంది. విచారణలో భాగంగా సిట్ అధికారులు బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. గత వారం చెన్నూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన ఇద్దరు మైనార్టీ నేతల వాంగ్మూలాలను నమోదు చేయగా రెండు రోజుల క్రితం పాలకుర్తి నియోజకవర్గంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు అనుచరుడైన బిల్లా సుధీర్ రెడ్డి వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. అయితే గతంలో ఎర్రెబెల్లి వెన్నంటి ఉన్న సుధీర్ రెడ్డి, బాల్క సుమన్ వెన్నంటి ఉన్న ఇద్దరు మైనార్టీ నేతలు నేడు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.

### పర్వతగిరి నుంచే..

సొంత మండలమైన పర్వతగిరిలోనే వార్ రూమ్ కేంద్రం ఏర్పాటు చేసుకున్న మాజీ మంత్రి అక్కడినుంచే తన వ్యవహారాలన్నీ చక్కదిద్దుకునేవారన్న ప్రచారం సాగుతోంది. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికలకంటే ముందే దీనిని ఏర్పాటు చేసినట్లు సమాచారం. సదరు మంత్రి తనకు ప్రత్యర్థులుగా వ్యవహరిస్తున్న కొండా మురళి, జంగా రాఘవ రెడ్డితో పాటు వారి అనుచరుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. పనిలో పనిగా తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న జర్నలిస్టులు, వ్యాపారుల ఫోన్లను కూడా ఆయన రహస్యంగా వినేవారన్న ప్రచారం సాగుతోంది. నగరంలోని ఒక ప్రముఖ వస్త్ర వ్యాపారి ఫోన్ ట్యాపింగ్ చేసి ఆయనను బెదిరించి అధిక మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు సమాచారం. అదే విధంగా పలువురు మహిళా నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసి తన అన అవసరాలు తీర్చుకునేవాడని గుసగుసలు వినిపిస్తున్నాయి.

### బిగిస్తున్న ఉచ్చు..

సిట్ విచారణలో మాజీ మంత్రి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఒక్కటొక్కటిగా బయటికి వస్తున్నాయి. అప్పుడు పోస్టింగులు పొందిన పలువురు పోలీస్ అధికారులు సైతం సదరు మంత్రికి నమ్మకంగా పనిచేశారన్న ఆరోపణలున్నాయి. దీంతో సిట్ అధికారులు సదరు పోలీస్ అధికారులు వ్యవహార శైలిపై కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. సదరు మాజీ మంత్రి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వివరాలు వెల్లడించేందుకు పలువురు సిట్ ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జాన్సీ రెడ్డి త్వరలో తన ఫోన్ ట్యాపింగ్ పై అధికారులకు వివరాలు వెల్లడించనున్నట్లు ప్రకటించారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్ ను రాజకీయ, ఆర్థిక అవసరాల కోసం వాడుకున్నారని ధ్వజమెత్తారు.





# గడ్డం కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డు

- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు ప్రధానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రచయిత గడ్డం కేశవమూర్తికి మరో అత్యున్నత పురస్కారం లభించింది. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, సంచలన రాజకీయవేత్త, మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ ఎన్టీ రామారావు స్మారక అవార్డును ఆయన పొందారు. విజయవాడకు చెందిన ఎక్స్ రే సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు గడ్డం కేశవమూర్తికి ఈ అవార్డును ప్రధానం చేసింది. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి సీతక్క చేతుల మీదుగా కేశవమూర్తి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రి శాలువాతో సత్కరించి మెమొంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గత మూడున్నర దశాబ్దాలుగా వివిధ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తున్న కేశవమూర్తి ఇప్పటి వరకు అరడజన్ పుస్తకాలను స్వయంగా రచించి ప్రచురించారు. అలాగే 100 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సక్సెస్ స్టోరీలను రాసి జనసారథులు పేరిట పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ లలో కూడా ప్రధాన భూమిక పోషించారు. మూడేళ్లపాటు వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించారు. తెలంగాణ ప్రభుత్వ విశిష్ట పురస్కారంతోపాటు జాతీయ స్థాయిలో అనేక అవార్డులను కేశవమూర్తి సొంతం చేసుకున్నారు. పేదల పెన్నిది మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అవార్డు ప్రధానంతో జర్నలిస్టు రంగానికి కేశవమూర్తి మరింత గౌరవం తీసుకువచ్చారని పలువురు సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, పాత్రికేయులు వ్యాఖ్యానించారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ కేశవమూర్తికి ఈ అవార్డు లభించడంపై వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, రాజకీయ వేత్తలు, అధికారులతోపాటు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ కమిషనర్ పై దౌర్జన్యం



- పోలీసులకు ఫిర్యాదు చేసిన కడారి సుష్మ
- మాజీ కౌన్సిలర్ పై కేసు

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మపై పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఆర్.పి జయంత్ లాల్ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ మేరకు కమిషనర్ సుష్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీఐ క్రాంతి కుమార్ కథనం మేరకు బుధవారం ప్రైవేటు వ్యక్తుల ప్రహరీకి సంబంధించిన వివాదంలో జయంతిలాల్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ సందీప్ రెడ్డితో దురుసుగా ప్రవర్తించారు. అనంతరం మీతో పనిలేదంటూ పరకాల పట్టణ మున్సిపల్ కమిషనర్ కడారి సుష్మ చాంబర్ తలుపులను తోసుకుంటూ వెళ్లి విధుల్లో ఉన్న ఆమెను అనుచితమైన మాటలతో దూషించి, నువ్వు ఎట్లా జాబ్ చేస్తావో నీ అంతు చూస్తా అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అంతేకాకుండా సూర రాజయ్యకు పురుగుల మందు డబ్బా ఇచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు పాల్పడాల్సిందిగా ప్రోత్సహించారు. దీంతో కమిషనర్ ఫిర్యాదు మేరకు కమిషనర్ చాంబర్ లోకి చొచ్చుకొని రావడంతోపాటు, అనుచితంగా వ్యవహరించడం, అతనికి సంబంధం లేని విషయంలో గొడవకు పాల్పడడం, ఆత్మహత్యకు ప్రోత్సహించిన విషయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

# 'మత్తు'కు దూరంగా ఉండాలి

- మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం
- నగర మేయర్ గుండు సుధారాణి
- అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** మత్తుకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని నగర మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎంజీఎం చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ జంక్షన్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అంకిత్ కుమార్ లతో కలిసి మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కఠినమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మత్తు వల్ల కలిగే అనర్థాలపై చిన్నతనంలోనే పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలు, కాళాశాలలు, యూనివర్సిటీల్లో డ్రగ్స్ నివారణ కమిటీలు వేయాలన్నారు. యువత ఒత్తిడిని అధిగమించడానికి యోగ, శారీరక శ్రమ చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకు కష్టపడి చదివిస్తున్నారని వారి ఆశయాలను నేరవేర్చాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణకు కృషి చేస్తామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను శిభారాణి, ట్రైనీ కలెక్టర్లు జయసింహ, హరిప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ రామకృష్ణ, లా అండ్ ఆర్డర్ సీఐ బి.గోపి, సీనియర్ వాలంటరీ దేవిశ్రీ ప్రసాద్, అధికారులు, సీడీపీఓలు, పోలీస్ అధికారులు, మెప్మా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవీవీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు తయారు చేసిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి అభినందించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## ● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తంగేడు మైదానం వద్ద ర్యాలీని





జెండా ఊపి ప్రారంభించిన మంత్రి సీతక్క, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ డీఎల్ఆర్ గార్డెన్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జి, అదనపు ఎస్పీ సదానందం, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, సంబంధిత అధికారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి ఉద్యమించాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం యువత ఉద్యమంలా పోరాడాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనగామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ర్యాలీని డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరి నితిన్ చేతన్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొని బస్టాండ్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ నెహ్రూ చౌక్ మీదుగా కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని డ్రగ్స్ ఫ్రీ సమాజం కోసం జాగృతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల విరక్తిని కలిగించేలా వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి యుద్ధ సైనికుడిగా సమరం సాగించాలని పిలుపునిచ్చారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమాచారం అందించుటలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ, డ్రగ్స్ నియంత్రణలో పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్‌పై అవగాహన పొందాలని, తద్వారా డ్రగ్స్ రహిత సమాజాన్ని చూడగలుగుతామన్నారు. విద్యార్థుల అవగాహన కోసం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. తదనంతరం గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. మత్తు పదార్థాలను దరిచేరనీయమని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజయ్య, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారిణి ఫ్లోరెన్స్, జిల్లా వైద్య శాఖ అధికారి మల్లికార్జునరావు, పోలీస్ శాఖ అధికారులు, సైకాలజిస్టులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల మత్తులో పడొద్దు

## సీఐ ఆర్ సంతోష్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** విద్యార్థులు మాదకద్రవ్యాల మత్తులో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆత్మకూరు సీఐ ఆర్. సంతోష్ పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పెట్రా ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలైన గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై లఘు చిత్రం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ సంతోష్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో యువత దుర్వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలు వాడినా, అమ్మినా లేదా వాడమని ప్రోత్సహించినా వారి వివరాలను తెలియజేయాలని ఆయన సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. విద్యార్థి దశలో చక్కటి ప్రణాళికతో చదువులను కొనసాగించాలని, క్రమశిక్షణ విద్యార్థులకు అత్యవసరమని, క్రమశిక్షణతోనే విద్యాభ్యాసం జరగాలని ఆయన వివరించారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో సీఐతో పాటు సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, స్పెక్ట్రా పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో బంగారు భవిష్యత్తు నాశనం

## ◆ మహేశ్వరం జడ్పీఎస్ఎస్ హెచ్ఎం స్వరూప



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** యువత మాదక ద్రవ్యాలకు బానిసైతే వారి బంగారు భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తు కూడా నాశనమవుతుందని మహేశ్వరం జడ్పీఎస్ఎస్ పాఠశాల హెచ్ఎం స్వరూప తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నర్సంపేట మండలం మహేశ్వరంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం స్వరూప మాట్లాడుతూ సరదా కోసమైనా మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల నష్టమే తప్ప లాభం లేదన్నారు. ఇలాంటి సరదాలకు దూరంగా ఉండాలని ఆమె విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాలను సేవించడం లేదా కలిగి ఉండటం చట్ట ప్రకారం నేరమని ఆమె గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో చదువుకొని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కష్టపడి చదివిన వారు ఉన్నత శిఖరాలను అధిరోహించి జీవితాంతం సుఖసంతోషాలతో గడుపుతారని స్వరూప అన్నారు. అయితే, చెడు వ్యసనాలకు బానిసలై, చదువుపై శ్రద్ధ పెట్టకుండా సంతోషంగా ఉన్నామని భ్రమపడితే జీవితమంతా కష్టాలు, శ్రమతో గడపాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేయూలో ప్రపంచ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ మెంబర్ ఇంచార్జి డాక్టర్ బి.రాధికా రాణి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, బయోటెక్నాలజీ అధ్యాపకురాలు డాక్టర్ రాధిక, లైబ్రరీ ఇంచార్జి ఇసాక్ ప్రభాకర్, లైబ్రరీ అసిస్టెంట్ తేజావత్ జోహార్‌తో పాటు విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు వాడకూడదని, వాడబోమని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

# గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలి

## ఎస్సై నరేష్ యాదవ్



**వరంగల్ వాయిస్. రఘునాథపల్లి :** సమాజం నుంచి గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలని రఘునాథపల్లి సబ్–ఇన్‌స్పెక్టర్ నరేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో విద్యార్థులతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, దుష్ప్రభావాల గురించి తోటి స్నేహితులకు, పిల్లలకు తెలియజేసి జాగృతం చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు మంచి లక్షణాలతో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కష్టపడి చదువుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఐ సోనీ, ఏఎస్ఐ కట్టమల్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిసలుగా మారొద్దు

## వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ యువతకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ డివిజినల్ పోలీసుల ఆధ్వర్యంలో భీమారంలోని ఎస్. వీ. ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమనికి ముఖ్య అతిదులుగా హాజరైన వరంగల్ పోలీస్ కమిషనర్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ముందుగా కాలేజీ ఆవరణలో ముందుగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషరేట్ మాదక ద్రవ్యాలను తరిమికొట్టాల్సిన భాధ్యత మనందరి పై ఉందన్నారు. . వరంగల్ కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలసికట్టుగా ముందడుగు వేసి వరంగల్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని అన్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకం సంఘటితం అవుతామని, సమాజం నుండి మాదక ద్రవ్యాలను తరిమి వేద్దామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు నర్సింహా రావు, కాజీపేట్ ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు రవికుమార్, శివకుమార్, రంజిత్ కుమార్, కేంద్ర సాహిత్య అవార్డు అంపశయ్య నవీన్, ఆచార్య రవికుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, జూన్ 26, 2025

# గురుపౌర్ణమి కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జూలై 10, గురువారం జరగనున్న గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని మందిరంలో వారం రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ వరంగల్ శ్రీ శ్రీ శ్రీ యజ్ఞానంద స్వామి ఆధ్వర్యంలో జూలై 3 నుంచి 9 వరకు జ్ఞాన యజ్ఞ సప్తాహం జరుగుతుందని మందిర చైర్మన్ మతుకుమల్లి హరి గోపాల్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, జూలై 10న మందిరంలో సాయిబాబాకు విశేష పూజా కార్యక్రమాలు, మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అర్చన, అభిషేకాలు నిర్వహించబడతాయి. ఆ రోజు మధ్యాహ్నం మహా అన్నదాన వితరణ కార్యక్రమం కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్‌లతో కలిసి హరి గోపాల్ గురుపౌర్ణమి పర్వదిన వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు వాటిని పంపిణీ చేశారు. భక్తులంతా ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

# ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా హరిచరణ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ ప్రాంత అభ్యాస్ వర్గ్ సమావేశం ఆర్మూర్‌లో జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జానా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా హరిచరణ్‌ను నియమించారు. హరిచరణ్ గతంలో జోనల్ ఇన్‌చార్జిగా, నగర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. 2022 నుంచి ఏబీవీపీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖకు, తెలంగాణ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాపురావుకు, విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హర్షవర్ధన్‌కు, ఏలేటి నాగరాజుకు, విభాగ్ కన్వీనర్ ఆరేపల్లి సుజిత్‌కు హరిచరణ్ ధన్యవాదాలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు దొమ్మటి సాంబయ్య పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య పరకాల నియోజకవర్గంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మండలంలోని మలకపేట గ్రామంలో పాలకుర్తి సుదర్శన్ తల్లి పాలకుర్తి కనకమ్మ అకాల మరణం చెందగా, ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం పరకాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడెల్లి సదన్ కుమార్ తల్లి గూడెల్లి వీరమ్మ, పాక్స్ మాజీ చైర్మన్ ఆకుల కుమార్ సోదరుడు ఆకుల రాజు ఇటీవల మరణించగా, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించి, మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో దొమ్మటి సాంబయ్యతో పాటు పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, మంద రాంచందర్, పరకాల మాజీ కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, పసుల రమేష్, ఎన్‌ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మడికొండ శ్రీను, నాయకులు బొచ్చు చందర్, ఒంటెరు రామూర్తి, బొచ్చు భాస్కర్, ఆముదలపల్లి మల్లేష్ గౌడ్, పాలకుర్తి శ్రీను, బొచ్చు రవి, గొట్టె రమేష్, గడ్డం రమేష్, బొచ్చు బాబు, బొచ్చు జితేందర్, బొచ్చు కుమార్, ప్రశాంత్, బొజ్జం సాయి, పసుల తిరుపతితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గుడిసె వాసులందరికీ పట్టాలు ఇవ్వాలి

**● తాటిపాముల వెంకట్రాములు**




**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలోని గుడిసెవాసులందరికీ వెంటనే భూమి పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వేముల శ్రీకాంత్‌లతో కలిసి వెంకట్రాములు భగత్ సింగ్ కాలనీలోని గుడిసెలను పరిశీలించారు. అక్కడ నివసిస్తున్న నిరుపేదల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇల్లు లేని వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, రోజువారీ కూలీ చేసుకునే శ్రమజీవులు భూపాలపల్లిలోని ప్రభుత్వ భూమిలో ఎన్నో కష్టాలకోర్చి గుడిసెలు వేసుకుని గత మూడేళ్లుగా నివాసం ఉంటున్నారని అన్నారు. ఎండలు, వానలు, చలి, క్రిమికీటకాలను తట్టుకొని పిల్లాపాపలతో జీవనం సాగిస్తున్న ఆ పేదల బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రోడ్లు, మంచినీటి వసతి, స్ట్రీట్ లైట్లు వంటి కనీస వసతులు కూడా వారికి లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై గుడిసెవాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కాలయాపన చేయకుండా వారికి వెంటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధంగా ఉండాలని గుడిసెవాసులకు వెంకట్రాములు పిలుపునిచ్చారు. గుడిసెవాసులకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయాలని డీఎస్ఎఫ్ఐ (డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఐటీడీఏపీఓకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు అజ్మీర వెంకట్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గిరిజన శాఖలో 2022–23 విద్యా సంవత్సరానికి రూ.1.25 కోట్లు, 2023–24 విద్యా సంవత్సరానికి రూ.1.50 కోట్లు, అలాగే ఎస్సీ శాఖలో 2022–23 సంవత్సరానికి ₹80 లక్షలు, 2023–24 సంవత్సరానికి రూ.60 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడం వల్ల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల పిల్లలకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెబుతూ, మరోవైపు నిధులను విడుదల చేయకుండా నిరాశకు గురి చేస్తోందని విమర్శించారు. కాబట్టి, పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఈ నిధులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ కళ్యాణి, వంశీ, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి




**వరంగల్ వాయిస్, జనగామ :** అర్హులైన పేదలందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. గురువారం జనగామలోని స్థానిక ఐద్వా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా మాట్లాడుతూ గ్రామానికి 10 నుంచి 20 ఇళ్లు సరిపోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇస్తామని చెబుతున్నారని, దీనిపై రీ–సర్వే చేసి అర్హులను గుర్తించి పేదలకే ఇళ్లు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అనేక ఆంక్షలు పెడుతున్నారని, ఎలాంటి షరతులు లేకుండా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోతే ఐద్వా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని షబానా హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు మోకు భవాని, పందిళ్ళ కళ్యాణి, జిల్లా కమిటీ సభ్యులు రాపర్తి రజిత, ఎర్ర అనిత, కస్తూరి కవిత, నక్క పూలమ్మ పాల్గొన్నారు.

# వ్యవసాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతు అవగాహన సదస్సులో ఆయన అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు మారాలని సూచించారు. తరతరాలుగా వస్తున్న వ్యవసాయ సంస్కృతి భారతదేశానికి అగ్రస్థానమని, ప్రపంచ మార్కెట్లో పోటీపడి రైతులు పంటలు పండించినప్పుడే దేశం ఉన్నత స్థాయికి ఎదుగుతుందని, రైతులు గౌరవంగా జీవించగలుగుతారని అన్నారు. పీఏసీఎస్‌లలో వ్యాపార దృక్పథం పోయి, రైతు శ్రేయస్సు కోసం పనిచేసినప్పుడే రైతుల అభివృద్ధికి కృషి చేసిన వారవుతారన్నారు. సేంద్రీయ పంటల వ్యవసాయ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందుకోసం




మండలానికి 125 మంది రైతులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమని పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆదాయంలో 34శాతం రైతుల నుంచే వస్తుందని, రైతుల ఆదాయం పెరిగితేనే రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టాలి

## ● ఏఐకేఎంఎస్ డిమాండ్




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) డోర్నకల్ మండల కార్యవర్గం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐకేఎంఎస్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల ఆదాయం తగ్గి, అప్పులు పెరిగి దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు నాలుగు లక్షలకు చేరుకున్నాయని, ఇది ఇంకా కొనసాగుతోందని తెలిపారు. మోడీ పాలనలో 2014 నుంచి 2024 వరకు గడిచిన పదేళ్లలో రెండు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కుటుంబాల సగటు ఆదాయం నెలకు రూ.10,218 కాగా, అందులో వ్యవసాయ పంటల నుంచి కేవలం రూ.3,798 మాత్రమే వస్తోందని 2019లో జరిగిన 77వ జాతీయ నమూనా సర్వే నివేదిక వెల్లడించిందని దేవేందర్ తెలిపారు. దీని ప్రకారం రోజుకు ఐదుగురు కుటుంబ సభ్యులకు సగటున రూ.27 మాత్రమే ఆదాయం వస్తోందని అన్నారు. రైతాంగానికి వ్యవసాయ రంగం లాభసాటిగా లేకపోవడం వల్ల చాలామంది వ్యవసాయాన్ని విడిచి తక్కువ వేతనాలకు పరిశ్రమలకు వెళ్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల విధానాలు, కార్పొరేట్ల బహుళజాతి కంపెనీల ప్రాబల్యం దోపిడీని పెంచాయని, ఆ విధానాలు వ్యవసాయాన్ని బలిపెట్టి కార్పొరేట్లకు ఆదాయం పెంచే విధంగా పాలకవర్గాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. రైతులకు సుదీర్ఘకాలంగా మద్దతు ధర లభించడం లేదని గుర్తు చేశారు. దేశ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి పాలకవర్గాల కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, దేశవ్యాప్తంగా బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ యాస వెంకటనారాయణ, జిల్లా నాయకులు కామ్రేడ్ కర్ణ చిలుకా రెడ్డి, నున్న ఉపేందర్, నాగుబండి భాస్కర్, గుండు నాగయ్య, మాలోత్ వీరన్న, వెంకటేష్, భాస్కర్, మైలవరపు పెద్ద భాస్కర్, నాగుబండి శంకర్రావు, మల్లయ్య, యాస భాస్కరరావు, తురక మల్లయ్య, నాయిని ఈరన్న, లాలు, అఖిల ముత్తయ్య, గురవయ్య, యేసు, నవీన్ పాల్గొన్నారు.

# తై బజార్ డ్యూటీ కారణంగా సెక్యూరిటీ గార్డుపై ఎంక్వైరీ

## వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** అన్నారం దర్గాలో సెక్యూరిటీ గార్డు విధుల్లో ఉన్నప్పుడు తైబజార్ టికెట్లను ఇస్తున్నాడనే ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్నారు. అన్నారం తై బజార్ వేలంలో గెలిచిన తన కోడలు భోజనానికి విరామం తీసుకుంటుండగా, తాను తాత్కాలికంగా మాత్రమే టికెట్ల అమ్మకం చేశానని పేర్కొన్నాడు. తన కోడలి తరపున తాను అరగంట పాటు నిలబడి భక్తులకు చిట్లను పంపిణీ చేశానని బాషుమియా అన్నారు. సెక్యూరిటీ గార్డుగా ఉన్నప్పటికీ తై బజార్ విధులు నిర్వర్తిస్తున్నాడని కొంతమంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు ఒక డీఎండబ్ల్యూహెచ్ అధికారి చేత  విషయాన్ని గురువారం విచారణ చేశారు.  సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నప్పుడు తై బజార్ పనిలో ఎందుకు పాల్గొన్నావని అతడిని ప్రశ్నించారు. సిబ్బంది పని తీరును, హాజరు పట్టిక, దర్గా పరిసరాలను పరిశీలన చేసి విచారణ రిపోర్ట్ ను కలెక్టర్ కు అందజేస్తామని తెలిపారు.

# డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ పరిధిలోని డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థినుల అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 28 (జూన్ 28, 2025) వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత తెలిపారు. కళాశాలలో బీకాం (సీఏ, జనరల్), బీఎస్సీ (బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంపీసీఎస్, ఎంసీసీఎస్, ఎంఎస్‌టీసీఎస్), బీఏ కోర్సులలో ప్రవేశాలకు అవకాశం ఉందని ఆమె తెలియజేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జూన్ 28వ తేదీ లోపు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో వరంగల్ జిల్లా పీడీఎస్‌యూ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ చాలా సంవత్సరాలు గడుస్తున్నా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఈ చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దీనివల్ల పేద, దళిత, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎలాంటి అనుమతులు లేకుండానే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పుట్టుకొచ్చాయని, వీటిపై విద్యాధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్, షూస్ వంటి వాటికి వివిధ రకాల పేర్లతో తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్నాయని ఆయన తెలిపారు. తక్షణమే వీటిపై విద్యా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని పాఠశాలలను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, కోశాధికారి సామాజి పవన్, సభ్యులు ప్రకాష్, రాజేష్, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నాను జయప్రదం చేయాలి

## రామ రాజేష్ ఖన్నా పిలుపు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 2025 జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్.హెచ్.ఎం (నేషనల్ హెల్త్ మిషన్) కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అల్లం అప్పయ్యకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో 78 రకాల క్యాడర్లలో ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరికీ ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక, ఉద్యోగుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం గోవర్ధన్, యోగానంద చారి, పరికిరాల రమేష్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తుల విష్ణుమూర్తి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్ పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే మున్నూరు కాపు భవనం మంజూరు

## ▪ కార్పొరేటర్ చెన్నం మధు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సహా ఏ రాజకీయ పార్టీ కూడా సబ్బండ వర్గాలను, కులాలను పట్టించుకోలేదని, కానీ స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోనే అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు నిర్మించారని జీడబ్ల్యూఎంసీ బీఆర్ఎస్ పార్టీ 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిటీ హాళ్లే దీనికి సాక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపుల 40 ఏళ్ల కలను సాకారం చేయడానికి మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఎంతో కృషి చేశారని చెన్నం మధు తెలిపారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి మున్నూరు కాపుల చిరకాల కోరికైన సంక్షేమ భవనానికి రూ.5 కోట్ల 55 లక్షల నిధులను మంజూరు చేయించి కల సాకారం అయ్యేలా చేశారని వివరించారు. మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి అడ్డుగా నిలిచిన కుడా మాస్టర్ ప్లాన్ రోడ్డును మాస్టర్ ప్లాన్ నుంచి నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో తొలగించడానికి వినయ్ భాస్కర్ కృషి చేశారని పేర్కొన్నారు. నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో భవన నిర్మాణ అనుమతి కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును రూ.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు తగ్గించారని, ఆ రుసుము కొంత దాస్యం వినయ్ భాస్కర్ సొంతంగా చెల్లించడం జరిగిందని చెన్నం మధు వెల్లడించారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట ఇచ్చి, నిధులు తెచ్చి మున్నూరు కాపుల చిరకాల కలను నిజం చేశారని అన్నారు. 2023 అక్టోబర్ 6న నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులతో కలిసి శంకుస్థాపన సైతం చేశారని గుర్తు చేశారు. శంకుస్థాపన జరిగిన కార్యక్రమానికి మళ్లీ శంకుస్థాపన చేయడాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞతకే వదిలేస్తున్నామని కార్పొరేటర్ వ్యాఖ్యానించారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు నీలం రాజ్‌కిశోర్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణ విషయమై రెండు మూడు రోజులుగా జరిగిన సంఘటనలు చూస్తే కాంగ్రెస్ పాలన "నిల్.. పబ్లిసిటీ ఫుల్" అన్నట్లుగా ఉందని విమర్శించారు. ఈ సందర్భంగా నాటి శంకుస్థాపన ఫొటోలు, నిధుల జీవోలను మీడియాకు చూపించారు. ఈ ప్రెస్‌మీట్ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరికారి శ్రీధర్, నాయకులు నీలం సుహాస్, హనుమకొండ జిల్లా యూత్ అధ్యక్షులు వరుణ్, జిల్లా కాపు నాయకులు నవీన్, బచ్చు అనిల్, వేణుగోపాల్, నగేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, జూన్ 26, 2025

# కేయూ హాస్టల్ డైరెక్టర్ తక్షణమే రాజీనామా చేయాలి

## ◆ స్వేరో స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పట్టించుకోని హాస్టల్ డైరెక్టర్ తక్షణమే రాజీనామా చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం హాస్టల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హాస్టల్ డైరెక్టర్ గత సంవత్సరం నుంచి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడ పోతున్నారని సాయికుమార్ ఆరోపించారు. వర్షాకాలం సందర్భంగా హాస్టల్ పరిసరాల్లో చెట్లు ఉండటం వల్ల దోమలు, ఈగలు పెరిగిపోతున్నా డైరెక్టర్ శ్రద్ధ చూపడం లేదన్నారు. అంతేకాకుండా, నిన్నగాక మొన్న పోతన హాస్టల్‌లో మహిళా విద్యార్థినులను ఎలుకలు కరిసిన వైనాన్ని కూడా ఇంతవరకు బయటికి తీయకపోవడానికి ప్రధాన కారణం హాస్టల్ డైరెక్టరేనని ఆయన పేర్కొన్నారు. హాస్టల్ డైరెక్టర్ పదవి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఏ ఒక్క హాస్టల్‌ను కూడా తనిఖీ చేయకుండా, విద్యార్థులతో ముఖాముఖి కాకుండా తన ఒంటెద్దు పోకడను అనుసరిస్తున్నారని, ఒక విద్యార్థిగా, విద్యార్థి సంఘ నాయకునిగా తాను దీన్ని ప్రశ్నిస్తున్నానని సాయికుమార్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటారని, అలాంటి వారి చదువుకు వస్తే ఈ ఎలుకలు, దోమలు, ఈగలు, భోజనం సరిగా లేకపోవడం, సరైన వసతులు లేకపోవడం వంటివి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కొంతమంది వర్కర్లే హాస్టల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న వైనాన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి గారికి చెప్పినా ఇంతవరకు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.హాస్టల్ డైరెక్టర్ మీద విచారణ కమిటీ వేసి తక్షణమే పదవి నుంచి తొలగించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ కాకతీయ యూనివర్సిటీ నాయకులు ప్రణయ్, రవి, తేజ, పవన్, రాహుల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాయపర్తి మండలంలోని సన్నూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా చిన్నపాక రవి, ఉపాధ్యక్షుడిగా ఈరెల్లి హరీష్, ప్రధాన కార్యదర్శిగా చిన్నపాక కుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చేరిపెల్లి దయాకర్, కోశాధికారిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, మణి, మనోహర్, ప్రవీణ్, ముకేష్, యాకయ్య, అశోక్, ప్రశాంత్, సుధాకర్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్చార్జిలు వశపక కుమార్, జిల్లా ధర్మయ్య మాట్లాడారు. ముప్పై ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ బహుజనుల సమస్యల పరిష్కారం గురించి పోరాడుతున్నారన్నారు.

# కేయూ స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్‌గా డాక్టర్ బైరి నిరంజన్ కొనసాగింపు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్‌గా సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బైరి నిరంజన్ శ్రీనివాస్ను కొనసాగిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. గత సంవత్సరం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నిరంజన్, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై సదస్సులు, విద్యార్థులకు హెల్త్ క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి, కాకతీయ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోనూ విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలను విస్తరించాలని డాక్టర్ నిరంజన్‌ను ఆదేశించారు.

# టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు



**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** టీజీఎన్‌పీడీసీఎల్ (తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ) డైరెక్టర్ (హెచ్.ఆర్.డీ) బాణాల అశోక్ కుమార్ li ఉద్యోగ సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు సంబంధించిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో కంపెనీ సెక్రటరీ బక్క దానయ్య (ఏడీఈ), కంపెనీ ఉపాధ్యక్షులు రౌతు రమేష్ కుమార్ (ఎల్ఐ), హనుమకొండ సర్కిల్ ఉపాధ్యక్షులు ఆర్. చలపతి, హనుమకొండ సెక్రటరీ వి.కృష్ణ, హనుమకొండ టౌన్ డివిజన్ సెక్రటరీ జె.రవి, శ్యాంకుమార్, రసూల్, రామకృష్ణ, యాకయ్య, విక్రమ్, తదితరులు ఉన్నారు.

# బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## పంచతంత్ర థీమ్ తో పార్క్

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** బతుకమ్మ కుంట జనగామ పట్టణానికి ఒక ప్రత్యేక ఆకర్షణగా మారేలా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి బతుకమ్మ కుంటను సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ. 1.50 కోట్లతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కుంటను పంచతంత్ర థీమ్‌తో అభివృద్ధి చేయాలని, సుందరీకరణ పనుల్లో భాగంగా గ్రిల్స్, గజిబోలు, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, ఇతర ఆట వస్తువులతో కూడిన చిన్న పార్కు ఏర్పాటు పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు చెరువు పూడికతీత పనులు, వాకింగ్ ఏరియా, లైటింగ్, ఫెన్సింగ్, ఒక వాటర్ ట్యాంక్ పనులు పూర్తయ్యాయని, మిగతా పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ రాజ్ కుమార్, ఏఈ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషోపాధ్యాయుడు వలస పైడికి డాక్టరేట్ ప్రదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వలస పైడికి డాక్టరేట్ పట్టా లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న పర్యవేక్షణలో "తెలంగాణలోని మాల ఉపకులాల సామాజిక సాంస్కృతిక జీవితం–సాహిత్య పరిశీలన" అనే అంశంపై ఆయన పీహెచ్ డీ పరిశోధన చేశారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పరిశోధనలో భాగంగా వలస పైడి, మాల ఉపకులాలు 37 ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నప్పటికీ, వాటిలో ముఖ్యమైన ఐదు ఉపకులాలైన మాల పంబాల, గుర్రం మాల, మిత్తిలి అయ్యాళ్వార్లు, మాల మాష్టి, మాల భోగం ఉపకులాల కళాకారుల సామాజిక, సాంస్కృతిక, కళామయ జీవితంతో పాటు వారి కథలలోని భాషా సాహిత్య అంశాలను అధ్యయనం చేసి, విశ్లేషణాత్మక పరిశోధనా ఫలితాలను వెల్లడించారు. వలస పైడి కవిగా ఇప్పటికే 11 పుస్తకాలను రచించారు. వీటిలో వచన కవిత్వం, గేయ కవిత్వం, నాటికలు ఉన్నాయి. వ్యాఖ్యాతగా అనేక ప్రభుత్వ కార్యక్రమాలలో సేవలందించారు. 2017లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పాటు అనేక అవార్డులు అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న వలస పైడిని మర్కజీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవి రామారావు తోపాటు ఉపాధ్యాయ బృందం, ఆచార్యబన్నా అయిలయ్య, డాక్టర్ లేతాకుల వెంకటరామిరెడ్డి, తిరునగరి నరేందర్, వల్లంపట్ల నాగేశ్వరరావు, తిరువరంగం ప్రభాకర్, ఎం.డి. జే రహమాన్, మల్లాడి ప్రభాకర్ రెడ్డి, ఆకుతోట శ్రీనివాస్, వలస రమేష్, బిట్ల వీరస్వామి, సుధాంశ, రామ హరికృష్ణ, డాక్టర్ సునయన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతుల సమస్యలను పరిష్కరించండి

## చేనేత పద్మ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీకాంత్



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చేనేత పద్మ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించాలని వీణవంక తహసీల్దార్ అంబటి రజితకు ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసిన శ్రీకాంత్, పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన తహసీల్దార్, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిబంధనలు పాటిస్తూ రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ వెంట సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరు శ్రీనివాస్ ఉన్నారు.

# లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్. దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామం వద్ద 163 జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన 50 ఏళ్ల మంచినీళ్ల వజ్ర అదే గ్రామంలోని ఎస్‌బీఐటీ గురుకుల పాఠశాల వసతి గృహంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే ఉదయం ఆమె నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తుండగా, వెనుక నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వజ్ర తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే అప్రమత్తమైన బంధువులు, స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆమెను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం.



# ప్రస్తుతానికి ఒంటరినే ..

### సరైన భాగస్వామి కోసం వెయిటింగ్

'దంగల్' బ్యూటీ ఫాతిమా సనా షేక్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఫాతిమా పరోక్షంగా స్పందించారు. తాను ఇంకా సరైన భాగస్వామిని పొందలేదని, సింగిల్‌గానే ఉన్నట్లు చెప్పారు. ఆర్.మాధవన్, ఫాతిమా సనా షేక్ నటించిన చిత్రం 'ఆప్ జైసా కోయి' వివేక్ సోని దర్శకత్వంలో ప్రేమకథగా రూపొందింది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం ఇటీవల ముంబయిలో జరిగింది. ఇందులో పాల్గొన్న ఆమె ప్రేమ, రొమాన్స్ గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'ఒకరినొకరు గౌరవించుకోవడం.. ఇష్టాయిష్టాలను పంచుకోవడంలోనే నిజమైన ప్రేమ దాగి ఉంటుంది. అదే విధంగా కొన్ని విషయాల్లో సర్దుకుపోవాల్సి ఉంటుంది. అలా చేసినప్పుడే బంధాలనేవి సజావుగా సాగుతాయి' అని ఆమె చెప్పారు. దీనిపై ఓ విలేకరి స్పందిస్తూ.. 'వ్యక్తిగత జీవితంలో మీ భాగస్వామిని కనుగొన్నారా?' అని ప్రశ్నించగా.. 'ఇంకా అలాంటి వ్యక్తి నా జీవితంలోకి రాలేదు. నిజం చెప్పాలంటే, మన ఇష్టాలను అర్థం చేసుకొని మనకు గౌరవం ఇచ్చేవారు కేవలం సినిమాల్లోనే ఉంటారు' అని ఆమె బదులిచ్చారు.

## ఎన్టీఆర్ చేతిలో మురుగ ది లార్డ్ బుక్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా గడుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రశాంత్ నీల్‌తో డ్రాగన్ అనే ప్రాజెక్ట్ చేస్తున్న తారక్ బాలీవుడ్ నుంచి వార్ 2 ని విడుదలకు సిద్ధం చేశాడు. ఈ చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ కోసం ముంబై నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారు.

అయితే తాజాగా ఆయన చేతిలో ఉన్న ఒక పుస్తకం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆనంద్ బాలసుబ్రహ్మణ్యం రచించిన 'మురుగ: ది లార్డ్ ఆఫ్ వార్, ది గాడ్ ఆఫ్ విస్డమ్ అనే పుస్తకం కనిపించింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# శరవేగంగా పెద్ది షూటింగ్

### త్వరలో జాయిన్ కానున్న జాన్వీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు కాంబోలో వస్తున్న సినిమా పెద్ది. మైత్రీ మూవీ మేకర్స్ గర్వంగా సమర్పించగా సుకుమార్ రైటింగ్స్ తో కలిసి వృద్ధి సినిమాస్ బ్యానర్ పై సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. స్పోర్ట్స్ ప్రధాన అంశంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను బుచ్చి బాబు భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నాడు. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ను హీరోయిన్ గా నటిస్తోంది. ఆ మధ్య రిలీజ్ చేసిన పెద్ది ఫస్ట్ గ్లిమ్స్ ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో చెప్పక్కర్లేదు. మరోవైపు ఈ సినిమా షూటింగ్ ను చక చక చేసేస్తున్నారు. కొంత కాలంగా హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్స్ మధ్య యాక్షన్ సీన్స్ ఫినిష్ చేసారు. అలాగే టాకీ పోర్షన్ సీన్స్ కూడా చేస్తున్నారు. హీరోయిన్ జాన్వీ కపూర్ జూలై 12న పెద్ది షూటింగ్‌లో తిరిగి జాయిన్ కానుంది. ఆ సమయంలో జాన్వీపై కొన్ని కీలకమైన రొమాంటిక్ సన్నివేశాలు మరియు రెండు పాటలను షూట్ చేయబోతున్నారు. ఇంకా దాదాపు 40 రోజుల చిత్రీకరణ మిగిలి ఉంది. హైదరాబాద్ లో షూటింగ్ ముగించి ఈ నెలాఖరు నుంచి డిల్లీలో షూటింగ్ చేసేందుకు షెడ్యూల్ ప్లాలాన్ చేసారు. దాదాపు ఓ ఒక వారం పాటు అక్కడ కీలక సీన్స్ తీయబోతున్నారు. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న పెద్ది 2026 మార్చి 27 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది.





# రేపు వస్తున్న.. కన్నప్ప

### అద్భుతమైన చిత్రం అంటూ నిర్మాత కోన వెంకట్ కితాబు

మంచు విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కన్నప్ప' జూన్ 27న శుక్రవారం ప్రేక్షకుల ముందుకురానుంది. భారీ తారాగణంతో రూపొందిన ఈ చిత్రంపై మంచు విష్ణు, మోహన్‌బాబులు భారీ ఆశలు పెట్టుకున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ నేటి తరానికి సందేశాత్మకం కావాలన్న ఆలోచనతో నిర్మించారు. ఇదిలావుంటే టాలీవుడ్ నిర్మాత కోన వెంకట్ రివ్యూ ఇచ్చారు. సినిమా కంటెంట్ తననెంతో ఆకట్టుకుందని పోస్ట్ పెట్టారు. 'కన్నప్ప' ముందుగానే చూడడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను. సినిమా కంటెంట్ ఆసక్తికరంగా ఉంది. ఇందులో ఆశ్చర్యపరిచే సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. చివరి అరగంట ప్రేక్షకులు మంత్ర ముగ్ధులవుతారు. ప్రభాస్ దీనికి ప్రత్యేక ఆకర్షణ. చివరి 20 నిమిషాల్లో విష్ణు అద్భుతంగా నటించారు. ప్రేక్షకులంతా ఆయన నటన గురించి కచ్చితంగా మాట్లాడుకుంటారు. ఎన్నో సంవత్సరాల తర్వాత మోహన్‌బాబు కూడా అందరికీ గుర్తుండిపోయే పాత్రలో కనిపించారు. ఈ సినిమా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని.. ఈ కష్ట సమయంలో ఇండస్ట్రీకి మరిన్ని లాభాలు అందిస్తుందని ఆశిస్తున్నా' అని పోస్ట్ పెట్టారు. విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా సిద్ధమైంది. దాదాపు పదేళ్లుగా ఆయన దీనికోసం వర్క్ చేశారు. ముకేశ్ కుమార్‌సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆయన టైటిల్ పాత్ర పోషించగా.. రుద్రగా ప్రభాస్, కిరాతగా మోహన్‌లాల్, శివుడిగా అక్షయ్‌కుమార్, పార్వతిగా కాజల్ అగర్వాల్ నటించారు. భారీ బ్జడెట్‌తో మోహన్‌బాబు దీన్ని నిర్మించారు. ఇందులో ఆయన మహదేవశాస్త్రిగా ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. 182 నిమిషాలు అంటే 3 గంటల 2 నిమిషాలు రన్‌టైమ్‌తో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.

### కన్నప్ప టీమ్‌కు విషెస్ చెప్పిన మనోజ్

భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా మూవీగా విడుదలవుతున్న 'కన్నప్ప' చిత్ర బృందానికి సినీ నటుడు మంచు మనోజ్ శుభాకాంక్షలు చెప్పారు. సినిమా భారీ విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా పోస్ట్ పెట్టారు. 'కన్నప్ప' చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. ఈ సినిమా కోసం నాన్న, ఆయన టీమ్ ఎన్నో ఏళ్లు ఎంతో శ్రమను, ప్రేమను పెట్టింది.



ఇది బ్లాక్ బస్టర్ హిట్ కావాలని ప్రార్థిస్తున్నా. మా లిటిల్ ఛాంప్స్ అరి, వివి, అవ్రామ్‌ల అందమైన జ్ఞాపకాలను బిగ్ స్క్రీన్‌పై చూడాలని ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. తనికెళ్ల భరణిగారి జీవితకాల కల జీవం పోసుకుని, శుక్రవారం విడుదలకానుండటం సంతోషంగా ఉంది. మంచి మనసున్న ప్రభాస్‌గారు, లెజెండరీ నటులు మోహన్‌లాల్ గారు, అక్షయ్‌కుమార్ గారు, ప్రభుదేవా గారు ఇలా ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. వీళ్లంతా ఈ సినిమా కోసం చేసిన సాయం, చూపించిన ప్రేమ, నమ్మకం ఎంతో గొప్పవి. ఎప్పుడెప్పుడు సినిమా చూద్దామా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఈ ప్రయాణానికి ఆ పరమేశ్వరుడి ఆశీస్సులు, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. మంచు మనోజ్ పెట్టిన పోస్టులో ఎక్కడా కూడా తన సోదరుడు, 'కన్నప్ప' కథానాయకుడు మంచు విష్ణు పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం.



## అత్యంత వైభవంగా..

# శాకంభరీ నవరాత్రోత్సవాలు ప్రారంభం

- జ్యోతి ప్రజ్వలన చేసిన చైర్మన్ శివసుబ్రహ్మణ్యం
- హాజరైన ధర్మకర్తలు, భక్తులు



(మొదటి పేజీ తరువాయి..) గణపతి పూజ, పుణ్యాహావాచనం, ఉత్సవ పూర్వాంగవిధి నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డికి ఆలయ ఈఓ శేషభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు సహస్ర కలశాభిషేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రహమఖం మూలమంత్ర హోమం, శాంతి హోమం నిర్వహించిన తదుపరి అమ్మవారికి రెండు గంటల సేపు 1,008 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అభిషేకం జరుగుతున్నంతసేపు భక్తులు తన్మయత్వంతో ఒక దివ్యానుభూతిని పొందారు. అనంతరం అమ్మవారి షడ్బేరాలలో అమ్మవారి ఎదురుగా ఉన్న బేరాన్ని (మూర్తి) కాళీ మాతగా, మహామండపంలోని బేరాన్ని కామేశ్వరీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. రాత్రి 8.30 గంటలకు నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణతో కార్యక్రమాలు పూర్తయ్యాయి. సహస్ర కలశాభిషేకానికి బాసాని విశ్వప్రకాశ్–శోభ దంపతులు, డాక్టర్ సాయివిక్షిత్–డాక్టర్ నిహంతి కావ్యత్, కంచనకుంట్ల సాంబశివరెడ్డి–వినోద దంపతులు, కంచనకుంట్ల శ్రీధర్రెడ్డి–కీర్తి దంపతులు దాతలుగా వ్యవహరించారు. శాకంభరీ నవరాత్ర తిథిమండల దేవతాయాగ దాతలు కాకిరాల నరసింహారావు–ఇందిర దంపతులు, డాక్టర్ సంతోష్ శ్రీకాంత్–డాక్టర్ రిదిమ దంపతులు, కౌటిల్య, డాక్టర్ పోతాని రాజేశ్వరప్రసాద్–డాక్టర్ లలితా దేవి దంపతులు, అనేకమంది వ్యాపార ప్రముఖులు, వివిధ రంగాల ప్రముఖులు, భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# మెరుగైన వైద్యం అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- పోచమ్మ కుంట పీహెచ్ సీ తనిఖీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. గురువారం హనుమకొండ పోచమ్మ కుంటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ విభాగం, వ్యాక్సిన్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ల్యాబ్ ని కలెక్టర్ పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంతమంది ఓపీ సేవలకు వస్తుంటారని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ లో పరీక్షలు నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఫార్మసీలో ఉన్న మందులను పరిశీలించి, ఇండెంట్ నమోదును ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్స్ తో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్స్ సమస్యలను ఓపిగ్గా విని అందుకు తగిన విధంగా వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీప్తి, డెమో అధికారి అశోక్ రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ గా శ్యాంసుందర్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపల్ కమిషనర్ గా వక్కాల శ్యాంసుందర్ గురువారం బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. విధుల్లో చేరిన అనంతరం మున్సిపల్ కమిషనర్ వక్కాల శ్యాంసుందర్ మాట్లాడుతూ గతంలో మందమర్రి శానిటరీ ఇనస్పెక్టర్ గా విధులు నిర్వహించానని పదోన్నతిలో భాగంగా తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ గా ప్రమోషన్ రావడంతో సంతోషంగా ఉందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణ ప్రజలు కూడా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సమర్థనం, సానిటరీ ఇన్స్పెక్టర్ కొమ్ము దేవేందర్, వార్డ్ ఆఫీసర్లు పట్టాభి, ప్రభాకర్, కనకరాజు, సుధాకర్, నవీన్, రాంబాయి, లావణ్య, రేణుక, ఉపేంద్ర, శ్రీకాంత్ మీనేష్, రవీందర్, పవన్ కళ్యాణ్, బిల్ కలెక్టర్ లు వెంకట్రాం, శంకర్, ప్రశాంత్ ఉపేందర్, మహేందర్, కరెంట్ సోమయ్య, శ్యామ్, జవాన్లు, వెంకన్న, మురళి, మహేష్, నరసమ్మ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎస్ టీపీ సందర్శించిన మేయర్, కమిషనర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బల్దియా పరిధి 44 వ డివిజన్ లోని మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ఎఫ్ఎస్ టీపీ) ని గురువారం నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇదే ప్రాంతంలో 150 కేఎల్ డీ సామర్థ్యంతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్న ఎఫ్ఎస్ టీపీ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు సమర్థవంతంగా పూర్తి చేసేందుకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ మహేందర్, డీఈ సారంగం, ఏఈ సంతోష్ కుమార్, సానిటరీ ఇన్ స్పెక్టర్ రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ..**

బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో గురువారం మెప్మా విభాగానికి చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్స్(సీఓ) లతో వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సకినాల రమేష్, ప్రవీణ్, సఫియా, శ్రీలత, గుండు రమ, సుజాత, శ్రీనివాసులు, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com